క్లుప్తంగా

పోచమ్మ ఆలయానికి భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే, నాయకులు

దండేపల్లి: మండలంలోని ద్వారకలో రూ.12లక్షల దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిధులతో చేపట్టే పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, వైస్ ఎంపీపీ అనిల్, సర్పంచ్ గీత, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోటాపోటీ.. నిరుపేదకు లాభసాటి

దండేపల్లి: నిరుపేద యువతి వివాహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గురువారం పోటాపోటీగా సాయం అందించడంతో ఆ నిరుపేద యువతికి లాభం జరిగింది. మండలంలోని కొత్తమామిడిపల్లికి చెందిన నిరుపేద యువతి కుదురుపాక మౌనిక వివాహానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు తనయుడు విజిత్‌రావు రూ.10వేల ఆర్థిక సాయం అందించగా, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు తాళిబొట్టు, పట్టుచీర అందించి అండగా నిలిచారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

కాసిపేట: మండలంలోని రొట్టపల్లిలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని బృహత్‌పల్లెప్రకృతివనం ఏర్పాటుకు ప్రతిపాదించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) మధుసూదన్‌నాయక్ ఆదేశాల మేరకు తహసీల్దార్ దిలీప్‌కుమార్ రొట్టపల్లిలో కబ్జాకు గురైన 21వ సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, పల్లెప్రకృతివనం ఏర్పాటుకు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు చేపట్టినా, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి కబ్జాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట డీటీ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎంసీసీ సిమెంట్ కంపెనీకి సంబంధించిన 324/1 సర్వే నంబర్‌లో ఉన్న 60ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆమ్ ఆద్మీపార్టీ మంచిర్యాల నియోజకవర్గం కో ఆర్డినేటర్ నయీంపాషా డిమాండ్ చేశారు. కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల
శ్రీనివాస : సార్
వెంకటేశ్వర : మిష్టర్ కింగ్
జెమిని సినిమా స్క్రీన్ 1 : సార్/ వినరో భాగ్యము విష్ణుకథ
జెమిని సినిమా స్క్రీన్ 2 : మిష్టర్ కింగ్/ కోనసీమ థగ్స్/ క్వాంటమానియా

లక్సెట్టిపేట
మహానంద : సార్

జన్నారం
రాఘవేంద్ర : మిష్టర్ కింగ్

చెన్నూర్
శ్రీశ్రీనివాస : వినరో భాగ్యము విష్ణుకథ

బెల్లంపల్లి
రామకృష్ణ : వినరో భాగ్యము విష్ణుకథ
బాలాజీ : సార్

సీసీసీ
దేవి : వినరో భాగ్యము విష్ణుకథ
తిరుమల : సార్

– మంచిర్యాలటౌన్

కాలువ పారదు.. బావినీళ్లు చాలవు

- ఎండుతున్న డీ–28 కాలువ ఆయకట్టు
- యాసంగి రైతుల కష్టాలు



ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు బొలిశెట్టి రమేష్. దండేపల్లికి చెందిన ఇతను ఈ యాసంగిలో డీ–28 కింద ఐదెకరాల్లో వరిసాగు చేశాడు. కడెం నీటితో పాటు, వ్యవసాయ బావి నీటితో పంట పండిద్దామనుకుంటే, కడెం నీళ్లు వస్తలేవు. బాయిల నీళ్లేమో సరిపోతలేవని వాపోతున్నాడు. దీంతో ఒకటి రెండు మడులు నీళ్లందక బీటలు వారినట్లు వాపోయాడు.



వ్యవసాయ బావిలో అడుగంటిన నీళ్లు



నీళ్లు పట్టేందుకు పైపులు అమర్చుతున్న రైతులు..

దండేపల్లి: ప్రస్తుత యాసంగి సాగుకు కడెం ప్రాజెక్టు నుంచి డీ–1 నుంచి 28 వరకు గూడెం ఎత్తిపోతల నీటిని డీ–30 నుంచి 42వరకు అందించేందుకు అధికారులు నిర్ణయించారు. దీంతో ఎంతో ఆశతో.. పంట సాగు చేసిన రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. కడెం నీటిని వారబందీ పద్ధతిలో అందిస్తున్నప్పటికీ, అతికష్టం మీద డీ–25వరకు మాత్రమే అందుతుండగా, డీ–28కు మాత్రం నీళ్లు పూర్తిస్థాయిలో అందడం లేదు. ఆయకట్టు రైతులు సాగునీటి కోసం రాత్రి, పగలు కష్టపడుతున్నారు. అయినా నీళ్లందక, పంటలు ఎండుతున్నాయని వాపోతున్నారు.

బాయిల నీళ్లు సాల్తలేవ్..

కడెం నీళ్లు అందని రైతులు యాసంగిలో సాగుచేసిన పంటలు ఎండిపోకుండా, ఉండేందుకు సమీపంగా ఉన్న వ్యవసాయ బావుల నీటిని పెట్టి కాపాడుకుందామంటే బావుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి. కనీసం గంటసేపు కూడా మోటారు నడుస్తలేవ్. దీంతో పంటలు చేతికి రావడం కష్టమే అని రైతులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సాగునీరందించి, పంటలు ఎండిపోకుండా చూడాలని కోరుతున్నారు.

నీళ్లు సరిపోవడం లేదు..



ఎండలు మండిపోవడంతో బాయిల నీళ్లు అడుగంటుతున్నాయి. మోటారు గంటసేపు నడిస్తే చాలు నీళ్లు అయిపోతున్నాయి. కడెం నీళ్లయితే సరిగా రావడం లేదు. గూడెం లిఫ్టు నీళ్లు వచ్చే పరిస్థితులు లేవు. కడెం నీళ్లు వస్తాయనే ఆశతో పంట సాగుచేసినప్పటికీ, ప్రస్తుత నీటి కష్టాలు చూస్తుంటే, పంటలు చేతికచ్చుడు అనుమానంగానే ఉంది.

– సాగర్, రైతు, దండేపల్లి

మురుగు కాలువలు నిర్మించరూ..! అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కనే మురుగునీరు నిలిచి అధ్వానంగా ఉంది. దుర్గంధం వెదజల్లుతోందని దోమలు, ఈగలకు ఆవాసంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని మురుగు కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి : అన్నయ్య, నేషనల్ హైవేస్ డీఈ ఫోన్ నంబర్ : 7382625560

ప్రేంసాగర్‌రావు దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటపల్లి: మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ప్రేంసాగర్‌రావు వర్గీయులు మద్యం తాగి సొంత పార్టీ నాయకులపైనే దాడి చేసి తీవ్రంగా గాయపర్చడాన్ని నిరసిస్తూ మండలంలోని రాంపూర్‌లో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భూషన్‌శర్మ, వెంకటస్వామి, సంపత్, యూత్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్, శేఖర్, కొటేశ్, దేవేందర్, నారాయణ, సుధాకర్, రాజయ్య పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: బెల్లంపల్లి నియోజకవర్గ పర్యటనలో భాగంగా ప్రేమ్‌సాగర్‌రావు అనుచరులు అన్యాయంగా నేతకాని మహర్ కుల హక్కుల పరిరక్షణ సంఘం వ్యవస్థాపకులు గోమాస శ్రీనివాస్‌పై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నేతకాని మహర్ సంఘం జిల్లా ఇన్‌చార్జి సునార్కర్ రాంబాబు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడి హేయమైనదని, మరోసారి పునరావృతమైతే ఊరుకునేది లేదని మండిపడ్డారు.

బతుకులు మారాలంటే.. బడికెళ్తేనే సాధ్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

భీమిని: కన్నెపల్లి మండలంలోని టేకులపల్లిలో గురువారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం టేకులపల్లి ఎస్టీ కాలనీలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలని, కై కిలీ, కూలీ బతుకులు మారాలంటే మీ పిల్లలను బడికి పంపించాలని సూచించారు. పిల్లల చదువులపై ఆరా తీశారు. కరెంట్ సమస్య, నీటి సమస్య తీర్చాలని స్థానిక ప్రజలు కోరడంతో అక్కడి నుంచి ఫోన్‌లో మిషన్‌భగీరథ, విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ నిరంజన్ గుప్తా, జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ కర్రె లతశ్రీ, బీఆర్ఎస్ కన్నెపల్లి మండల అధ్యక్షుడు రంగారావు, రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ శ్రీరామరావు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహం



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్ శాస్త్రి

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలో శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం కొనసాగుతోంది. మహిళలు మంగళ హారతులతో పెద్ద ఎత్తున సప్తాహం కార్యక్రమానికి హాజరై ప్రముఖ పండితులు సంతోష్‌కుమార్ శాస్త్రి బోధించే ప్రవచన సూక్తులు వింటున్నారు. భక్తులకు ప్రతిరోజు మూడు పూటలు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పార్‌పల్లి క్షేత్రంగా జరిగే ఈ శ్రీ మద్భాగవత సప్తాహం కార్యక్రమానికి కోటపల్లి, చెన్నూర్, మంచిర్యాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రవీణ్, పురుషోత్తం, లక్ష్మీనారాయణతో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరాలు ప్రారంభం



భీమారం: ప్రారంభిస్తున్న డాక్టర్ శ్వేత, సర్పంచ్ సునీత

భీమారం: మండలంలోని ఆరెపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని డాక్టర్ శ్వేత, సర్పంచ్ సునీత ప్రారంభించారు. ఈ మేరకు మండల వైద్యాధికారి శ్వేత మాట్లాడుతూ రెండో విడుత కింద చేపట్టిన కంటివెలుగు కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేమనపల్లి: నీల్వాయి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రైతువేదికలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గాలి మధు, ఎంపీటీసీ సంతోష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, కో ఆప్షన్ సభ్యులు, వైద్యాధికారి రాజేష్, పంచాయతీ కార్యదర్శి అశోక్, క్యాంపు కో ఆర్డినేటర్ ఆర్.బాపు, సూపర్‌వైజర్ సరోజ పాల్గొన్నారు.

నియామకం

జన్నారం: మండలంలోని రాంపూర్ గంగపుత్ర మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని గురువారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా మత్స్య సహకార సంఘం ఇన్‌స్పెక్టర్ శృతి తెలిపారు. అధ్యక్షురాలిగా కల్లెడ స్వరూప, ఉపాధ్యక్షురాలిగా గుమ్ముల నర్సమ్మ, కార్యదర్శిగా కల్లెడ సుజాత, డైరెక్టర్లుగా శంకరమ్మ, రాజేశ్వరి, లక్ష్మీ, నర్సమ్మ, సుజాతను నియమించినట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సర్పంచ్ సులోచన, కార్యదర్శి వెంకటయ్య, మండల గంగాపుత్ర సంఘం అధ్యక్షుడు కల్లెడ నర్సయ్య అభినందించారు.

సింగరేణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కాసిపేట: మండల కేంద్రంలో భారత్‌కి ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా ఏరియా ఆస్పత్రి డీవైసీఎంవో ఆదేశానుసారం గురువారం సింగరేణి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు సంబంధించి వివిధ వ్యాధులకు మందులు పంపిణీ చేసి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కె.రామ్మోహన్, సిస్టర్ మల్లేశ్వరి, సిబ్బంది మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోతుల నుంచి రక్షణకు 'సోలార్ కంచె'



భీమారం: మండల కేంద్రంలో పదేళ్ల నుంచి గ్రామంలో కోతులు స్వైరవిహారం చేస్తూ దాడికి పాల్పడుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార సామగ్రి ఎత్తుకెళ్తున్నాయి. కోతుల బెడద నుంచి రక్షణగా ఉండేందుకు తక్కువ ధరకు సోలార్ కంచె అందుబాటులోకి రావడంతో ఇళ్ల చుట్టూ సోలార్ కంచె (తీగలు)అమర్చుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ కంచెలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

27న సత్యశోధన నాటక ప్రదర్శన

పాతమంచిర్యాల: అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్‌కు చెందిన కళాకారులు ఈ నెల 27న సాయంత్రం 6గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో మహాత్మజ్యోతిభాపూలే, సావిత్రి బాయిపూలే జీవిత చరిత్రపై 'సత్యశోధన' అనే నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు పూలే విగ్రహసాధన కమిటీ, బహుజన ఐక్యవేదిక నాయకులు తెలిపారు. నాటకానికి సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూలేవిగ్రహ సాధన కమిటీ, దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు రంగు రాజేశం, పలిగిరి కనకరాజు, అలుగూరి కైలాసం, గోమాస ప్రకాష్, దుర్కె మోహన్, జాడి రాజేష్, మారంపల్లి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

'ట్యాంపరింగ్ చేస్తే చర్యలు తప్పవు'

జైపూర్: విద్యుత్ మీటర్లను ట్యాంపరింగ్ చేస్తూ విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ట్రాన్స్ కో ఇన్‌చార్జి ఏఈ భాస్కర్ తెలిపారు. మండలంలోని కుందారంలో గురువారం విజిలెన్స్ బృందం తనిఖీలు నిర్వహించారు. 5 మీటర్లు విద్యుత్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లుగా గుర్తించారు. ఆ వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, వారందరికీ రూ.2,11,000 జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాజధాని సర్వీస్ ప్రారంభించాలని వినతి

జన్నారం: ఉట్నూర్, జన్నారం మండలాల మీదుగా రాజధాని సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు ఝనీరెడ్డి తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్‌నేత వినతిపత్రం అందజేశారు. ఆర్ఎం స్పందించి, రాజధాని సర్వీస్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

తైబజార్, వారాంతపు సంతల వేలం

మందమర్రిరూరల్: క్యాతనపల్లిలో నిర్వహించే 2023–24 ఆర్థిక సంవత్సరపు రోజువారి సంత (తైబజార్)ను, వారాంతపు సంతను గురువారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో పల్లె దినేష్, దాసరి రాజేందర్ పాల్గొనగా రోజువారి సంత (తైబజార్)ను రూ.1,77,500, వారాంతపు సంతను రూ.45,160కు వేలంలో ఎక్కువగా పాడి పల్లె దినేష్ వసూళ్ల హక్కులను దక్కించుకున్నాడు. బహిరంగ వేలంలో మున్సిపాలిటీ మేనేజర్ నాగరాజు, ఆర్ఐ కృష్ణప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

క్యాడర్ స్కీం ప్రమోషన్ కోసం ఇంటర్వ్యూలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని హాల్లో గురువారం (సీ) క్యాటగిరి నుంచి (బి) క్యాటగిరీ క్యాడర్ స్కీం ప్రమోషన్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏరియాలో ఎస్‌డీఎల్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఆరుగురు ఉద్యోగులు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఎస్వో టూ జీఎం కృష్ణారావు, ఐఈడీ రాజన్న, హెచ్‌వోడీ శ్యాంసుందర్, సీనియర్ పీవో సత్యబోస్, ఆఫీస్ ఓఎస్ రాజలింగు ఉన్నారు.

పంచాయతీ అధికారులతో సమీక్ష



సమీక్ష జరుపుతున్న శిక్షణ కలెక్టర్ గౌతమి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ కలెక్టర్ గౌతమి ఆధ్వర్యంలో ఎంపీడీవో అబ్దుల్‌హై, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఎంపీవో శ్రీనివాసరెడ్డితో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీలో 60మంది కూలీలు పనికి హాజరయ్యేలా చూడాలని, ఎక్కువ రోజులు పని చేస్తే అంత ఎక్కువ కూలి వస్తుందని తెలియజేస్తూ కూలీలను చైతన్యం చేసి పనికివచ్చేలా చూడాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున కార్మిక బడ్జెట్ లక్ష్యాన్ని చేరుకునేలా నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచనలు చేశారు. ఎండలు ముదురుతున్నందునా హరిత హారం మొక్కలకు నీటి ట్యాంకర్‌తో వారానికి మూడు సార్లు నీళ్లు పోయాలని, నర్సరీలకు గ్రీన్‌షెడ్ నెట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రధానంగా కంపోస్ట్ షెడ్‌లలో వర్మీ కాంపోస్ట్ తయారు చేసేలా కృషి చేయాలని చెప్పారు. ఆర్థిక సంవత్సరంలో పెట్టుకున్న ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని వంద శాతం చేరుకోవాలని స్పష్టంగా సూచించారు. అనంతరం హాజీపూర్ మండలంలోని రాపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని ప్రాథమిక పాఠశాల తరగతి గదిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కాసేపు కాలక్షేపం చేస్తూ సరదాగా గడిపారు. బోధనా విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

జీవాలకు నట్టల నివారణ టీకాలు



వేమనపల్లి: నట్టల నివారణ మందు వేస్తూ..

తాండూర్: మండలంలోని కొత్తపల్లిలో గురువారం జీవాలకు నట్టల నివారణకు టీకాలు వేశారు. మండల పశు వైద్యాధికారి భూమయ్య, సర్పంచ్ రజిత, ఉపసర్పంచ్ చీర్ల రాజేశం నట్టల నివారణ మందులను పంపిణీ చేసి జీవాలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తపల్లి గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సభ్యులు , పశువైద్యశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్, చందారం గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామంలోని పశువులకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ చుంచు రవి, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలోని గొల్లవాడలో పశు వైద్యాధికారి చందన్‌కుమార్ ఆధ్వర్యంలో జీవాలకు గురువారం నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుబిడె మధుకర్, సిబ్బంది ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఏఎల్సీ శ్రీనివాస్

శ్రీరాంపూర్: కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని వీటీసీలో పారిశ్రామిక వివాదాల చట్టం, గ్రాట్యూటీ చట్టంపై గురువారం ఆయన కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రతి కార్మికుడు తన కోసం ప్రభుత్వం చేసిన చట్టాలు తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం(పర్సనల్)లు గోవిందరాజు, అరవిందరావు, సీనియర్ పీఓలు కాంతారావు, రాజేశ్, దేవేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై అవగాహన

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎస్అండ్‌పీసీ ఆఫీస్ పక్కన గల ఎస్ఎంటీసీలో గురువారం సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ హాజరై మాట్లాడారు. సింగరేణిలో ప్రతి ఉద్యోగి రక్షణ పరికరాలు ధరించి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వోటూజీఎం కృష్ణారావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఓదెలు, ఏరియా అధికారులు పాల్గొన్నారు.

సంత్ గాడ్గెబాబా జయంతి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని గాంధీపార్కు వద్ద తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాయకుల ఆధ్వర్యంలో సంత్ గాడ్గెబాబా జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.